# అబలకు అండగా..!

## కౌన్సెలింగ్‌తో నిలబడుతున్న కాపురాలు
## బాధిత మహిళలకు భరోసాగా మహిళా పోలీస్‌స్టేషన్లు
## బీఆర్‌ఎస్ హయాంలో వేలాది కేసులు పరిష్కారం

భువనగిరికలెక్టరేట్, జూన్ 15 : అగ్ని సాక్షిగా మూడు ముళ్ల బంధంతో ఒక్కటై.. నూరేళ్లు కలిసి జీవిస్తామని ప్రమాణం చేసిన ఆలుమగలు.. నేడు యాంత్రిక జీవితంలో ఒత్తిడికి లోనై అనుమానం, అపోహలతో పచ్చని సంసారాల్లో చిక్కులు కొనితెచ్చుకుంటున్నారు. ప్రేమ పెళ్లి, పెద్దలు కుదిర్చిన వివాహమని తేడా లేకుండా నిత్యం వాదనలతో విడిపోయేందుకు సైతం వెనకడుగు వేయడం లేదు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఇలా కాపురాలు కూలిపోతున్న సంఖ్య రోజురోజుకూ పెరగడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలుమగల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించేందుకు గాను 2018లో మహిళా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న వివాదాలను పరిష్కరించి మళ్లీ వారి దాంపత్య జీవితాల్లో కొత్త వెలుగులు చిగురించేలా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

### తొలి ఏడాది భారీగా ఫిర్యాదులు..

బీఆర్‌ఎస్ హయాంలో ఏర్పాటైన మహిళా పోలీస్‌స్టేషన్‌లలో తొలి ఏడాది భారీగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ విధంగా తమ వద్దకు వచ్చిన బాధితుల సమస్యలు పరిష్కరిస్తూ ఎంతో మందికి అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోనూ 2018లో మహిళా పోలీస్‌స్టేషన్ ప్రారంభించగా.. ఇప్పటివరకు పోలీసులు వేలాది కేసులు పరిష్కరించారు.



పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అర్జునయ్య

### కేసుల వివరాలు..

ప్రతి ఏడాది కేసుల సంఖ్య పెరుగుతున్నది. 2018లో 377 ఫిర్యాదులు వస్తే.. 348 ఫిర్యాదులను పరిష్కరించి 29 కేసులు నమోదు చేశారు. అదే విధంగా 2019లో 428 ఫిర్యాదుల్లో 378 ఫిర్యాదులను పరిష్కరించి 50 కేసులు నమోదు చేశారు. 2020లో 376 ఫిర్యాదుల్లో 313 పరిష్కరించి 63 కేసులు నమోదు చేశారు. 2021లో 501 ఫిర్యాదుల్లో 403 పరిష్కరించి 67 కేసులు నమోదు చేశారు. 2023లో 1,180 ఫిర్యాదుల్లో 1052 పరిష్కరించి 128 కేసులు నమోదు చేశారు. 2024లో 999 ఫిర్యాదులు అందగా.. 889 పరిష్కరించి 110 కేసులు నమోదు చేశారు. 2025లో ఇప్పటి వరకు 395 ఫిర్యాదులు అందగా.. 353 పరిష్కరించి 42 కేసులు పోలీసులు నమోదు చేశారు.



భువనగిరి మహిళా పోలీస్‌స్టేషన్

### ఇరువర్గాలకు సమన్యాయం



పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును పరిగణలోకి తీసుకుంటాం. అత్యధికంగా అదన పు కట్నాలు, వివాహేతర సంబంధాలు, మద్యానికి బానిసై గొడవలు, రెండవ వివాహలు తదితర కేసులు వస్తుంటాయి. బాధితులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఇరువర్గాలకు సమగ్ర న్యాయం చేకూర్చేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. అయితే మొండి ఫిర్యాదులపై మాత్రమే కేసులు నమోదు చేస్తాం.

**- అర్జునయ్య, సీఐ, మహిళా పోలీస్‌స్టేషన్**

## నేడు రైతు నేస్తం ప్రారంభం

బీబీనగర్, జూన్ 15 : నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభించి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారని మండల వ్యవసాయ అధికారి పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాయరావుపేట్, పడమటిసోమారం గ్రామాల్లోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ సాగులో మెళకువలు, సలహాలు, సూచనలు అందించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించేందుకు సదుపాయం ఏర్పాటు చేస్తామని ప్రతి మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన వ్యవసాయ పద్ధతుల గురించి శాస్త్రవేత్తల ద్వారా వివరిస్తారన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వ్యవసాయంలో నూతన పద్ధతులను అనుసరించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చౌటుప్పల్ , జూన్ 15 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన లక్కారం జాతీయరహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతానికి చెందిన భూక్యా మహేశ్ అతని స్నేహితులు గోపు అనూష, గజ్జల గోపాలకృష్ణ, తన్మయిలు కలిసి విజయవాడ అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యలో వారు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి బీఎస్ఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అనూష, గోపాలకృష్ణ, తన్మయిలు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. భూక్యా మహేశ్ ఫిర్యాదు మేరకు సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాల పాల సొసైటీ చైర్మన్‌గా రాంరెడ్డి

రాజాపేట, జూన్ 15 : మండలంలోని జాల పాల సొసైటీ చైర్మన్ గా 12 వ సారి గొల్లపల్లి రాంరెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన డైరెక్టర్లుగా కొన్యాల బాలమణి, పల్లె సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాల మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, కొన్యాల మల్లారెడ్డి, ఠాకూర్ బీకాం సింగ్, కొన్యాల నరసింహారెడ్డి,కొల్లూరి ఆంజనేయులు, కొల్లూరి కనకయ్య, ముక్కర సాయిలు, కొండం ప్రభాకర్‌రెడ్డి, మొగిలి వెంకటయ్య, కొండ మహేందర్‌రెడ్డి, కిష్టయ్య, బర్మ కనకయ్య పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకరయ్య

## కర్రె వెంకటయ్యను అరెస్టు చేయడం
# హేయమైన చర్య
### మున్సిపాల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య

ఆలేరు టౌన్, జూన్ 15 : మల్లాపురంలో శాంతియుతంగా గ్రామ ప్రజలతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్యను అరెస్టు చేయడం హేయమైన చర్య అని ఆలేరు మాజీ మున్సిపాల్ చైర్మన్ వస్పరి శంకరయ్య ఆరోపించారు.ఆలేరు పట్టణంలోని తన నివాసం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ హయాంలో యాదగిరిగుట్ట మం డలం , మల్లాపురం గ్రామంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేస్తే , ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అదే మెడికల్ కాలేజీని దాతర్‌పల్లిలో శంకుస్థాపన చేయడాన్ని నిరసిస్తూ గ్రామంలో ఆమరణ నిరాహార దీక్షకు కర్రె వెంకటయ్య కూర్చుంటే పోలీసులు దీక్షను భగ్నం చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసి, నిధులు విడుదల చేస్తే అదే కాలేజీకి దాతర్‌పల్లిలో శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు.15,00 కోట్లు గత ప్రభుత్వ హయాంలో మాజీ ప్రభుత్వ విప్ , గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి విడుదల చేసిన నిధులు తప్పు , మీరు కొత్తగా తెచ్చిన నిధులు ఏమి లేవని విమర్శించారు. కర్రె వెంకటయ్యకు పోలీసులు ఎలాంటి హాని తలపెట్టిన బీర్ల అయిలయ్య తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. గతంలో మాజీ ప్రభుత్వ విప్,సునీతామహేందర్‌రెడ్డి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20కోట్లు ఆలేరు అభివృద్ధి కోసం తెస్తే , నిధులతో అభివృద్ధి చేయకుండా అభివృద్ధిని అడ్డుకోవడం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సమంజసమేనా అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు ధైర్యం దమ్ము ఉంటే ఆలేరును అభివృద్ధి చేసిన చూపించాలని ఆయన సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు పత్తి వెంకటేష్, పంతం కృష్ణ, దయ్యాల సంపత్, జింకల రామకృష్ణ, ఎండీ ఫయాజ్ , ఎండీ గోరేమియా,ఎండీ జమాల్, సంతోశ్ రెడ్డి, కటకం బాలరాజు, భాసాని ప్రశాంత్, చింతపండు సుదర్శన్, కాసుల బాధ శశిప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 : రైతు భరోసా నిధులు ఎప్పుడు విడుదల చేస్తారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో సీపీఐ పట్టణ ద్వితీయ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలన్నారు. సాగునీటి వనరులు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో నక్సలైట్‌ను కాల్చి చంపడం హేయమైనా చర్య అని, నక్సలైట్లతో శాంతి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం సీపీఐ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, మండల కార్యదర్శి భూషణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు యాదయ్య, మండల మాజీ కార్యదర్శి నరసింహ, నాయకులు సాయిరెడ్డి, రాములు, బాల రసింహ, సోమయ్య, రామచంద్రం, నరసింహ, శ్రీశైలం, మైసయ్య, నరసింహ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి


రాజాపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుమలేశ్

## ఆకట్టుకున్న సాధనశూరుల విన్యాసాల ప్రదర్శన

ఆత్మకూరు(ఎం),జూన్ 15: మండల కేంద్రంలో ఆదివారం కరీంనగర్ జిల్లా వినవంకమండలం చల్లురుకు చెందిన సాధనశూరులు పూర్వకాలం నుంచి వస్తున్న వంశపార్యాయం పర విద్యను ప్రదర్శించారు. సాధనశూరులు ప్రదర్శించిన వివిధ రకాల విన్యాసాలు, వింతలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## రవి ఆత్మహత్య కేసును సీబీఐకి అప్పగించాలి

రాజాపేట, జూన్ 15 : ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న గంధమల్ల రవి ఆత్మహత్య కేసును సీబీఐకి అప్పగించి విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు రవి కేసును సీబీఐకి అప్పగిస్తే నిజానిజాలు బయటకి వస్తాయని తెలిపారు. రవి కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ సెక్రటరీ జనరల్ భాస్కర్ గౌడ్, ఎర్ర గోకుల జశ్వంత్, పులి చం ద్రమౌళి, నాగపురి పుల్లయ్య, గొల్ల రాజయ్య, ఈర్ల నరసయ్య, మాడిశెట్టి ఆంజనేయులు, అంకతి నరసయ్య, బాబు, మురళి పాల్గొన్నారు.

## కూరెళ్ల ఉప కేంద్రానికి ఫ్రిజ్ బహూకరణ

ఆత్మకూరు (ఎం), జూన్ 15 : కూరెళ్ల ఆరోగ్య ఉప కేంద్రానికి గ్రామానికి చెందిన ఆమనిగంటి నరేశ్ జ్ఞాపకార్థం 2010–2011 సంవత్సరంలో చదువుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఫ్రిజ్ అందజేశారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలి

వలిగొండ, జూన్ 15 : ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై ఈ నెల 24న మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముట్టడి ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం పులిగిల్లలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పథకంగా మారిందని, గ్రామాల్లో ఇండ్లులేక అర్హులైన పేదలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూరిందని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ముత్యాలు, సురేందర్, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, ఆంజనేయులు, ముత్యాలు, లింగం తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటు

భువనగిరికలెక్టరేట్, జూన్ 15 : ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని కంత మహేశ్వర స్వామి ఆలయం ఆవరణలో సొంత నిధులతో సీసీ రోడ్డును ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శివరాజ్‌గౌడ్‌ను గ్రా మస్థులు కొనియాడారు. వీరవెళ్లిలోని గౌడసంఘం సభ్యులు, గ్రామస్థులు గత వారం రోజుల క్రితం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీంతో ఆలయాన్ని సందర్శించిన శివరాజ్‌గౌడ్ ఆలయ ప్రాంగణంలో గదుల నిర్మాణ, సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలో భాగంగా ఆదివారం గ్రామస్థులు, గౌడసంఘం నాయకుల సమక్షంలో సీసీ రోడ్డును ప్రారంభించారు.


ఆలయం వద్ద సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దాత, శివరాజ్‌గౌడ్

## ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలి

ఆత్మకూరు(ఎం), జూన్ 15 : మండల కేంద్రానికి మంజూరైన 42 ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని మాజీ సర్పంచ్ జన్నాయికొడె నగేశ్ అన్నారు. ఆదివారం గ్రామంలో ఇండ్ల నిర్మాణం కోసం చేపట్టిన భూమి పూజలో పాల్గొన్నారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

# నగదు బదిలీ వెంటనే ప్రారంభించాలి
### జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహ


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

భూదాన్‌పోచంపల్లి, జూన్ 15 : గత అసెంబ్లీ ఎన్నికల ముందు గొల్ల కుర్మలకు ఇస్తామన్న రెండు లక్షల రూపాయల నగదు బదిలీ పథకం వెంటనే ప్రారంభించాలని గొర్రెల, మేకల పెంపందార్ల సంఘం ( జీఎంపీఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దయ్యాల నరసింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పోచంపల్లిలో కొదండ రాంరెడ్డి పెద్దన్న భవనంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం 2017లో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకంలో రెండవ విడతగా జిల్లాలో 13,000 యూనిట్లు రావాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నగదు బదిలీ ద్వారా ప్రతి ఒక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున జమ చేస్తామని హామీ ఇచ్చి యేడాదిన్నర దాటినా అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వాలు గొల్ల కురుమలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి తప్ప హామీల అమలులో చిత్తశుద్ధి లేదన్నారు. యాదాద్రి జిల్లాలో 342 మంది 43,750 రూపాయల చొప్పున నాలుగేళ్ల క్రితం డీడీలు తీసి కలెక్టర్ ఖాతాలో జమ చేయగా ప్రస్తుత ప్రభుత్వం వారికి డబ్బులు తిరిగి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో తమ వాటా కోసం గొల్ల కుర్మలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డైరెక్టర్ నరసింహ,జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీశైలం, ఎంపీఎస్ నాయకులు జంగయ్య, బుచ్చయ్య, చంద్రయ్య, మల్లయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయండి



భూదాన్ పోచంపల్లి, జూన్ 15 : నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు పిలుపునిచ్చారు. ఆదివారం భూదాన్ పోచంపల్లిలో తెలంగాణ క్షౌరవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉచిత కరెంటు పెండింగ్ బిల్లులు ప్రభుత్వ వెంటనే చెల్లించాలని, కరెంటోల్ల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి సంఘం అధ్యక్షుడు చింతల ఓం ప్రకాష్ , రవీందర్ , శ్రీధర్ , భాస్కర్ ,నవీన్, వెంకటేశ్ , స్వామి పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సంస్థాన్ నారాయణపురం, జూన్ 15: మండలంలోని పుట్టపాక గ్రామంలో 2004 – 2005 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను పాఠశాలలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఒకచోట కలిసి తాము చదివిన పాఠశాలలో కలియ తిరుగుతూ చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**PLOT FOR SALE**
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |

## తుంగతుర్తి కి నిధులు మంజూరు చేయాలి

మోత్కూరు, జూన్ 15: తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సామేల్ రాష్ట్ర మంత్రి సీతక్కను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవనల్ ఆమెను ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని మోత్కూరు, అడ్డగూడూరు, శాలిగౌరారం మండలాల్లోని పలు గ్రామాల పంచాయతీ రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. వాటి అభివృద్ధి కోసం, పలు గ్రామాల్లోని దళిత వాడల అభివృద్ధి కోసం ఎస్సీ సబ్ ప్లాన్ కింది నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 15: పిలాయిపల్లి గ్రామానికి చెందిన కాసుల వెంకటేశం, కాసుల జ్ఞానేశ్వర్ బత్తుల ముత్యాలుకు మొత్తం 55 వేల రూపాయల చెక్కులను నాయకులు లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొడిసే భూషణం, తోట శ్రీనివాస్, పెరుమాండ్ల దానయ్య, బందారపు లక్ష్మణ్‌గౌడ్, తోట బాబు, బందారపు దర్శన్, ఆకుల అంజయ్య, బందారపు పెద్దనరసింహ పాల్గొన్నారు.

## నాణ్యత లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం

మోత్కూరు, జూన్ 15 : దత్తప్పగూడెంలో నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కో కన్వీనర్ తుమ్మల మురళీధర్‌రెడ్డి అన్నారు. ఇటీవల గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో ఈజీఎస్ కింద నిర్మాణం చేసిన సీసీ రోడ్ల పనులను ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామాలాభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం ఈజీఎస్ కింద లక్షల రూపాయలు కేటాయించి పనులను చేపడితే ఇక్కడ కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన అధికారులు పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించడం లేదన్నారు. సీసీ రోడ్డు వేసిన రెండు నెలలకే పగుళ్లు వచ్చి సిమెంట్ కంకర లేచి పాడైపోయిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్ పనులను నాసిరకంగా చేశారని తెలిపారు. నాసిరకం పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బీజేపీ జిల్లా నాయకులు జితేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌యాదవ్, నాయకులు గుంటి సతీశ్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

## 19న ఎంపిక పోటీలు

బొమ్మలరామారం,జూన్15 : రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 19న బొమ్మలరామారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎంపిక క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రోజారాణి ఆదివారం తెలిపారు. 30మీటర్ల ఫ్లయింగ్ స్టార్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్నింగ్, 6.10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో(కిలో బరువు) వర్టికల్ జంప్, ఫెక్సిబులిటీ మరియు మెడికల్ టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు 2016 నవంబర్ 1 నుండి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.